ప్రజాశక్తి

మంగళవారం 29 ఏప్రిల్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఓటింగ్‌లో పాల్గొన్న ఎక్స్ అఫిషియో సభ్యులు, టిడిపి, జనసేన, వైసిపి కార్పొరేటర్లు.. ఎన్నిక నిర్వహిస్తున్న జెసి ఎ.భార్గవ్‌తేజ (ఇన్‌సెట్)

మేయర్‌గా రవీంద్ర ఎన్నిక

- ఏడు ఓట్ల ఆధిక్యతతో ఏడవ మేయర్‌గా గెలుపు
- వైసిపి విప్‌ను లెక్కచేయని ఫిరాయింపు కార్పొరేటర్లు
- నూతన మేయర్‌కు పలువురు అభినందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా టిడిపి కార్పొరేటరు కోవెలమూడి రవీంద్ర ఏడు ఓట్ల ఆధిక్యతతో ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవతేజ ప్రిసైడింగ్ అధికారిగా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక సమావేశానికి కార్పొరేటర్లతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యులుగా కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంఎల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, గళ్లా మాధవి, బి.రామాంజనేయులు హాజరయ్యారు. వైసిపి నుంచి 29 మంది కార్పొరేటర్లు హాజరవుతారని భావించగా వై.రవి, ఎం.అంజలిదేవి హాజరు కాలేదు. 54 మంది కార్పొరేటర్లు, ఏడుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు కలిపి మొత్తం 61 మంది హాజరయ్యారు.

టిడిపి నుండి కోవెలమూడి రవీంద్ర, వైసిపి నుంచి అచ్చాల వెంకటరెడ్డి పోటీలో ఉన్నారని జెసి ప్రకటించారు. కోవెలమూడి రవీంద్రను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ప్రతిపాదించగా 13 డివిజన్ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు బలపరిచారు. అచ్చాల వెంకటరెడ్డిని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ప్రతిపాదించగా 45వ ▶ 2లో

ప్రమాణ స్వీకారం చేస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

సుందర నగరంగా తీర్చిదిద్దుతాం : రవీంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దుతామని, ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామని నూతన మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మేయర్‌గా ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుంటూరు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని అన్నారు. రహదారులు ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు వివిధ శాఖల సమన్వయంతో పని చేస్తామన్నారు. కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రజలు, అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. తనకు మేయర్‌గా అవకాశం కల్పించినందుకు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, సహకరించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోండి

- యువతకు సిఎం చంద్రబాబు పిలుపు
- విట్‌లో నూతన భవనాలకు ప్రారంభోత్సవం
- రాజధానికి భూములిచ్చిన కొందరు రైతుల్ని దత్తత తీసుకోవాలని విట్ వ్యవస్థాపకులకు సూచన

ప్రజాశక్తి - తుళ్లూరు

దేశ భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సిఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఉద్యోగంతోనే సంతృప్తి చెందకుండా సంస్థలను స్థాపించే స్థాయికి యువత ఎదగాలని ఆకాంక్షించారు. రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన 'వి లాంచ్ పాడ్ 2025-స్టార్టప్ ఎక్స్‌పో'లో చంద్రబాబు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ బ్లాక్, వివి గిరి బ్లాక్, దుర్గాబాయి దేశముఖ్ బ్లాక్ నూతన భవనాలను ప్రారంభించారు. వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, విద్యార్థులు పక్కా ప్రణాళికతో తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో ముందుకు సాగుతూ 2047 కల్లా ఆంధ్రప్రదేశ్‌ను జిడిపిలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబెడతామని చెప్పారు. త్వరలోనే రాష్ట్రానికి క్వాంటం వ్యాలీని తీసుకువస్తామన్నారు. ఐటి, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ విభాగాల్లో ఉన్న అపార అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. రాజధానిలో విట్ యూనివర్సిటీని నెలకొల్పేందుకు 200 ఎకరాలు కావాలని విట్ వ్యవస్థాపకులు విశ్వనాథన్ కోరగా 100 ఎకరాలు ఇచ్చామని, మిగిలిన భూమి కూడా ఇస్తామని, విట్‌లో ▶ 2లో

డిసిసిబి చైర్మన్‌గా మక్కెన!

డిసిఎంఎస్‌కు వడ్రాణం హరిబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) చైర్మన్‌గా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నియమితులయ్యారు. జిల్లా మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులుగా పొన్నూరుకు చెందిన వడ్రాణం హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు జాబితాను టిడిపి ప్రకటించింది. అధికారికంగా ఇంకా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. 2004 నుంచి 2009 వరకు వినుకొండ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేసిన మల్లికార్జునరావు 2009లో కాంగ్రెస్ నుంచి సీటు రాకపోవడంతో పోటీ చేయలేదు. ఆ తర్వాత వైసిపిలో చేరినా ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం దక్కలేదు. దీంతో గత ఎన్నికలకు ముందు అప్పటి వైసిపి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో విభేదించి టిడిపిలో చేరి జీవీ ఆంజనేయులు విజయానికి కృషి చేశారు. ఎమ్మెల్సీ పదవిని ఆశించిన మక్కెన మల్లికార్జునరావుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవిని ఇచ్చారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జిగా ప్రస్తుతం జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బ్యాంకులో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణ నేపథ్యంలో మల్లికార్జునరావుకు ఈ పదవి దక్కట ముళ్ల కిరీటమేననే చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా వడ్రాణం హరిబాబుకు సామాజిక సమీకరణల నేపథ్యంలో ఈ పదవి ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈయన్ను ఈ పదవికి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సిఫార్సు చేసినట్టు సమాచారం.

కోకో గింజలకు అంతర్జాతీయ ధర చెల్లించాలి

ఉద్యాన శాఖ కమిషనరేట్ వద్ద రైతులు భారీ ధర్నా

మతోన్మాద దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - తాడికొండ

మతోన్మాద దాడులను అరికట్టాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు సోమవారం తాడికొండ, బండారుపల్లి గ్రామాలలో నిరసన ర్యాలీ చేపట్టారు. మత సామరస్యాన్ని కాపాడాలి అంటూ మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మతోన్మాదులకు ప్రభుత్వం గట్టి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల పహల్గామ్ లో తీవ్రవాదులు దాడి చేసి 26 మందిని చంపిన నేపథ్యంలో పర్యాటకులపై విచక్షణ రహితంగా కాల్పులకు తెగబడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాడికొండ పోలీస్ స్టేషన్ వద్ద మానవ హారం ఏర్పడ్డారు.కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు ,పూర్ణ అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కాశ్మీర్ లో తెహల్గాం ఉగ్రవాద దాడిని, భారతీయ పర్యటకులపై జరిగిన దాడులకు నిరసనగా మతి చెందిన బాధిత కుటుంబాల పట్ల సానుభూతిని వ్యక్తం చేస్తూ సత్తెనపల్లి జర్నలిస్టులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి గడియార స్తంభం వరకు, అక్కడ నుండి పాత పోలీస్ స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో సత్తెనపల్లి పట్టణ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం పెద్దతురకపాలెం గ్రామంలో మైనారిటీ పాఠశాల మరియు కళాశాలల భవన నిర్మాణ పనులను సోమవారం చదలవాడ అరవింద బాబు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాఠశాల, కళాశాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత సంబంధిత మంత్రి ఫరూక్ ని కలిసి పాఠశాల, కళాశాలల గురించి వివరించడం జరిగిందన్నారు. వెంటనే మంత్రి స్పందించి ఆగిపోయిన నిధులను మంజూరు చేయడం వలన పాఠశాల కళాశాలలో పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. రోడ్లు పనులను పూర్తి చేసి రానున్న విద్యా సంవత్సరానికి పాఠశాల, కళాశాలలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

నేడు నియోజకవర్గ కూటమి కార్యకర్తల విస్తృత సమావేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో మంగళ వారం నియోజకవర్గ స్థాయి కూటమి నేతలు కార్యకర్త ల విస్తృత స్థాయి సమావేశం జరుగనుందని టిడిపి కార్యాలయం నుండి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి పల్నాడు జిల్లా ఇం చార్జి మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ. ఆంజనేయులు, ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు, జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షులు కొమ్మాల పాటి శ్రీధర్, ఏపి టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, పరిశీలికులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొనున్నారని తెలి పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు.

మట్టి పరీక్షలకు నమూనా సేకరణ

ప్రజాశక్తి - నాదెండ్ల

రైతుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ వేసవికాలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి పరీక్షలను నిర్వహించున్నారు. ఈ మట్టి పరీక్షల కొరకు మండలంలోని అన్ని గ్రామాలలో నమూనాల సేక రణ జరుగుతోందని, రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించి మట్టి పరీక్షల్లో పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్ కోరారు. ఈ పరీక్షల ఆధారంగానే ఏ పంటలకు మన నేల అనుకూ లం, నేలలో ఉన్న లోపాలను సవరించుట కొరకు తీసు కోవాల్సిన చర్యలు, ఎరువుల వినియోగం, సూక్ష్మధాతు లోప నివారణ చేసేందుకు సాధ్యమవుతుందని తెలిపారు.

మేయర్‌గా రవీంద్ర ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

డివిజన్ కార్పొరేటర్ యక్కలూరి మారుతి బలపరిచారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి రవీంద్రకు 34, వైసిపి అభ్యర్థి వెంకటరెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. రవీంద్ర విజయం సాధించినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందించి, ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మేయర్ చాంబర్లో రవీంద్ర భాధ్యతలు స్వీకరించారు. నూతన మేయర్‌కు జెసితోపాటు నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, కేంద్ర మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు అభినందనలు తెలిపారు. వాస్తవంగా 2021లో జరిగిన ఎన్నికల్లో 46 మంది వైసిపి నుంచి గెలుపొందగా ఒకరు మృతి చెందారు. 45 మంది వైసిపి కార్పొరేటర్లు ఉండగా 18 మంది టిడిపి, జనసేనలో చేరారు. మిగతా 27 మందిలో ఇద్దరు హాజరు కాలేదు. దీంతో వైసిపి బలం 25, ఇద్దరు ఎమ్మెల్సీలతో 27కి పరిమితమైంది. టిడిపి, జనసేనలో చేరిన 18 మందికి వైసిపి విప్ జారీచేసినా వారు పట్టించుకోకుండా టిడిపి అభ్యర్థికి ఓటేశారు. మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడు ఓటింగ్‌కు హాజరై వైసిపి అభ్యర్థికి ఓటువేశారు.

నైపుణ్యాలను పెంపొందించుకోండి

(మొదటి పేజీ తరువాయి)

50 వేల మంది విద్యార్థులు చదివేలా అభివృద్ధి చేయాలని అన్నారు. 29 వేలమంది రైతులు 34 వేల ఎకరాలు ఇచ్చారని, వారందరినీ ముందుకు తీసుకువెళ్లవలసిన బాధ్యత మాపై ఉందని అన్నారు. వారిలో కొందరిని దత్తత తీసుకోవాలని విశ్వనాథన్‌ను కోరినట్లు చెప్పారు. విట్‌కు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రాజధాని నిర్మాణ పనులను పున్న ప్రారంభించడానికి మే 2 న వస్తున్నారని, ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. అమరావతిలో చేయాల్సిన అభివృద్ధి పనులు చేస్తున్నామని, రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లోనూ పలు సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. పహల్గాంలో ఉగ్రదాడిని ఖండించారు. విఐటి వ్యవస్థాపకులు డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ సిఎం చేతుల మీదుగా మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వానికి అందించడానికి విట్ యూనివర్సిటీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో సంస్కృతి, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, టిఐఈ గ్లోబల్ అండ్ స్థాపకులు చైర్మన్ మురళి బుక్కపట్నం, వోల్వో టెక్నాలజీస్, ఐబిఎస్ గ్లోబల్, మార్కెటింగ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వరల్డ్ ఇన్వెన్షన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అసోసియేషన్స్ (పోలాండ్) సీఈవో ఎడిటా వోల్షిక్, చల్లా నాగ్ (హెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హైదరాబాద్), విశ్వవిద్యాలయ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ వి.కోటారెడ్డి, కాదంబరి, ఎస్.విశ్వనాథన్, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి పాల్గొన్నారు. సాయంత్రం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు.

ఆత్మకూరులో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో మొసలి నాగయ్య ప్రభావతి మరియు మొసలి శివమ్మ ల స్మారక చలివేంద్రం ను సోమవారం పకీరయ్య ప్రారంభించారు. మొసలి శివమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా రాము అనే వికలాంగునికి 25 కేజీల బియ్యం , నిత్యవసర సరుకులు అందించారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్షలలో 600 మార్కులకు గాను 571 మార్కులు సాధించిన మొసలి గీతిక కు రూ.5వేల బహుమతిని అందించారు. గ్రామ సెంటర్ నందు మొసలి లీలా కళప్ప సారథ్యంలో విజయవాడ అనీల హస్పటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో షుగర్ బీపీ వివిధ రకముల వ్యాధులకు డాక్టర్ ఎన్ రాకేష్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు తాటి వెంకటరావు, కె. సుకుమార్, మోతుకూరు రవి, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కట్టా కళప్ప, మొసలి అశోక్ పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల మంజూరుకు వినతి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా మరికొన్ని అర్బన్ హెల్త్ సెంటర్లను మంజూరుచేయాలని ఎమ్మెల్యే గళ్ళామాధవి కోరారు. ఈమేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పేరున రాసిన వినతిపత్రాన్ని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు సోమవారం వెలగపూడి సచివాలయంలో అందించారు. పలు అర్బన్ పిహెచ్‌సిలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ఎటి అగ్రహారం, కోబాల్డు పేట, ఎస్‌వివిఎన్ కాలనీలో కొత్తగా మంజూరు చేయాలని, అలాగే తుపాను నగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రి భవనాలను తిరిగి నిర్మించాలన్నారు. ఈమేరకు పలు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

గుంటూరు అభివృద్ధికి కృషి : కేంద్ర మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మేయర్ ఎన్నిక అనంతరం కార్పొరేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గుంటూ రులో ఇప్పటికే మంజూరైన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేయాల్సిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రవీంద్ర 20 ఏళ్లుగా టిడిపి కోసం అంకితభావంతో పని చేశారని, సొంత డబ్బును ఖర్చు చేసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించారని, పలు మార్లు ఆయన సీటును త్యాగం చేశారని అన్నారు. కౌన్సిల్‌లో బలమైన ప్రతిపక్షం ఉందని, అయినా ప్రజా సమస్యల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలు దష్ట్యా కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అందరూ కూటమి సభ్యులుంటే అభివృద్ధి మరింత వేగంగా పూర్తి చేయగలుగుతామని ఉద్దేశంతో ఈ మార్పునకు ప్రయత్నించామని చెప్పారు. స్థానిక ఎన్నికలు కూడా పూర్తయితే అందరూ ఒకే తాటిపై నడుస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టించగలమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యేలు గళ్ల మాధవి, మొహమ్మద్ నజీర్ అహ్మద్, బి.రామాంజనేయులు, డిప్యూటీ మేయర్ సజీలా, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

ఎఫ్‌సిఐ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా బృందా

రవీంద్రనాథ్‌కు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పదవీ విరమణతోనే జీవితానికి ఫుల్‌స్టాప్ పడినట్లు కాదని... అక్కడి నుంచి సామాజిక స్పృహతో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించడమే ఎవరి జీవితానికైనా అర్థం - పరమార్థాన్ని ఆపాదించి పెడుతుందని... శాసన మండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. అందుకు భారత ఆహార సంస్థ విశ్రాంత ఉద్యోగుల నడవడికే ప్రత్యక్ష నిదర్శనమని ఆయన కొనియాడారు. సేవా గుణ సంపన్నతతో పాటు వారిలో మానవత్వం మెండని ఆయన తెలిపారు. భారత ఆహార సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బృందా రవీంద్రనాథ్ తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు అమరావతి రోడ్డులోని మల్లేశ్వరి ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన రాష్ట్ర సమావేశంలో ఈమేరకు ఎన్నికలు నిర్వహించారు. విశాఖపట్నంకు

చెందిన ఆలిండియా వైస్ చైర్మన్ ఏఎస్ రామారావు, తాడేపల్లిగూడెంకు చెందిన కె సుధాకరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. బృందా రవీంద్రనాథ్‌తో పాటు రాష్ట్ర వైస్ చైర్మన్‌గా రాజమండ్రికి చెందిన కె.నాగేశ్వరరావు, కార్యదర్శిగా భీమవరంకు చెందిన జి గోపాలరావు, సహాయ కార్యదర్శిగా విజయవాడకు చెందిన ఆర్ సాయిబాబు, కోశాధికారిగా పశ్చిమ గోదావరికి చెందిన డి మురళీమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా చైర్మన్‌గా పి యల్లమంద, కోశాధికారిగా ఎన్ ప్రభాకరరావు ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ తర్వాత ఖాళీగా కూర్చోకుండా తాను స్థాపించిన స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారని వివరించారు. రాష్ట్ర అధ్యక్షుడు బృందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ, 1990 నుంచి యూనియన్ వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. అలా అనేక హోదాలలో పనిచేస్తూ 2022లో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్‌గా ఎంపికైనట్లు చెప్పారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో తనను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్న విశ్రాంత ఉద్యోగులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులైన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు నల్లయ్య, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - అచ్చంపేట

అక్షయ

రోడ్డు ప్రమాదంలో కస్తల గ్రామానికి చెం దిన చిన్నారి వేమవరపు అక్షయ(2) మృతి చెంద గా వేమ వరపు జ్యోత్స్న కాలికి తీవ్ర గాయాలైన సంఘ టన అచ్చంపేట మండల పరిధిలోని చెరుకుం పాలెం గ్రామం వద్ద సోమవారం చోటు చేసుకుంది కస్తల గ్రామానికి చెందిన వేమవరపు ప్రకాష్, నందిని, జోత్స్న చిన్నారి అక్షయ ద్విచక్ర వాహనంపై తాడు వాయి గ్రామంలో ప్రారంభోత్సవానికి వెళు తున్నా రు. ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్ టెక్ చేస్తున్న సమయంలో ఎదురుగా కారు రావడం తో ద్విచక్ర వాహనం స్కిడ్ అయి కింద పడ్డారు ఆ సమయంలో ట్రాక్టర్ జ్యోత్స్న ఆమె ఒడిలో ఉన్న చిన్నారి అక్షయ ట్రాక్టర్ టైర్ కింద పడిపోవడంతో చిన్నారి అక్షయ వైద్యశాలకు తరలించే సమయంలో మృతి చెందింది. జోత్స్న కాలికి తీవ్ర గాయాలు కావ టంతో108 వాహనం ద్వారా సత్తనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు అచ్చం పేట ఎస్సై వెంక

విద్యుత్ పరికరాలు, వైర్లు చోరీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో ద్యుత్ వైర్లు చోరీ అయిన ఘటన ఫిరంగిపురం లోని మార్నింగ్ స్టార్ కళాశాల క్రీడా మైదానం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్మెంట్లో శనివారం అర్ధరాత్రి జరిగింది. కాంప్లెక్స్ నిర్వాహకులు తెలి పిన వివరాల ప్రకారం శనివారం రాత్రి ముగ్గురు యువకులు కాంప్లెక్స్‌లో ప్రవేశించి సుమారు 2 గంటలపాటు చోరీకి పాల్పడ్డారు. విలువైన విద్యుత్ పరికరాలు, వైర్లు చోరీ అయ్యాయని, వాటి విలువ సుమారు 5లక్షలవరకు ఉంటుందని తెలిపారు. వారి కదిలికలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఈ చోరీ పై బాధితులు ఫిరంగిపురం పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు.

అర్హులైన విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2025-26 విద్యా సంవత్సరం ఉచిత అడ్మిషన్లు ప్రారం భానికి సంబంధించిన సమాచారం ప్రజలకు అందించే నిమిత్తం వాల్ పోస్టర్లను కలెక్టర్ పిఅరుణ్ బాబు సోమవారం ఆవిష్క రించారు. విద్యాహక్కు చట్టం- 2009, సెక్షన్ 12(1)(సి) ప్రకా రం 2025 - 26 విద్యా సంవత్సరానికి ఉచితంగా 25 శాతం వివిధ కేటగిరీ విద్యార్థులకు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఇవ్వాల్సి ఉంది. అందుకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. విద్యార్థులందరూ ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. ప్రతికూల పరిస్థి తులను ఎదుర్కొంటున్న వర్గాల బలహీన వర్గాల పిల్లలకు రాష్ట్రంలో వారి సమీప నివాస ప్రాంతంలోని సీబీఎస్ఈ, ఐసి ఎస్సి, ఐబి రాష్ట్ర సిలబస్ ప్రకారం అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్

వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచితంగా చేరేందుకు 25శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు రిజిస్టర్ చేయడానికి %www.cse.ap.gov in% వెబ్ సైట్ లాగిన్ పూర్తి సమా చారాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. సోమవారం జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 168 అర్జీలను ప్రజల నుంచి అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ 4వ సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో మంగళవారం నుంచి నాలుగో సెమిస్టర్ పీజీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. 13 పరీక్ష కేంద్రాల్లో 3500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు జరుగుతాయని ఆయన వెల్లడించారు.

30న జరిగే పరీక్ష సమయాల్లో మార్పు

పీజీ పరీక్షల్లో భాగంగా ఈనెల 30వ తేదీన జరిగే పరీక్ష సమయంలో మార్పు చేసినట్లు సిఇ తెలిపారు. 30న రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ అర్హత పరీక్ష ఉండటంతో ఆ సమయాల్లో ఏఎన్యూ పీజీ పరీక్ష ఉందనీ, ఇన్చార్జి వీసీ ఆచార్య గంగాధర రావు ఆదేశాల మేరకు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరగాల్సిన పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు సీఈ తెలిపారు.

వైద్యశాలకు 20 ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణ సమీపంలో లింగంగుంట్ల గ్రామ పరిధిలో గల 200 పడకల ప్రభుత్వ జిల్లా ఏరియా వైద్యశాల కు ప్రముఖ వ్యాపారవేత్త ప్రవల్లిక సత్యం 20 ఫ్యాన్లను అంద జేసి, మానవత్వం చాటుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా వుండటంతో స్థానిక ప్రభుత్వ జిల్లా ఏరియా వైద్యశాలలో రోగు లు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న ఆయన సోమ వారం హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షులు వనమా సాంబశివరావు, ఏరి యా హాస్పిటల్ కమిటీ నెంబర్ నాగవరపు హనుమత్ ప్రసాద్, గుర్రం సుబ్రహ్మణ్యం, పలు వురు వ్యాపారులు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న విద్యా హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసు కోవాలని సిపిఐ కార్యవర్గ సభ్యులు ఉలవలపూడి రాము అన్నారు. నరసరావు పేట సిపిఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమా వేశంలో రాము మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం 1వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఎంఈఓ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మే 15వ తేదీ వరకు ఎంఈఓ కార్యాలయంలో అడ్మిషన్లు తీసుకోవ డం జరుగుతుందన్నారు.ఎస్‌టి, బీసీ, మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏఐ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ ఏరియా కార్యదర్శి సిహెచ్. సత్యనారాయణ రాజు, ప్రసన్న కుమార్, గోపికృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

దయనీయంగా పొగాకు రైతుల పరిస్థితి

ప్రజాశక్తి - తాడికొండ

గత ఏడాది క్వింటాలుకు 20 వేల వరకు ఉన్న బ్లాక్ బర్లీ పొగాకు ఈ ఏడాది మూడు నుంచి నాలుగు వేల రూపాయలు లోపే కొనుగోలు చేసే పరిస్థితి లేక రైతుల పరిస్థితి దయ నీయంగా మారిందని రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వంతో రెండు మూడు సార్లు చర్చలు జరిపినా స్పందించకపోవడంతో మే 5వ తేదీన చలో సీఎం క్యాంప్ ఆఫీసు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రచార యాత్రలో భాగంగా గుంటూరు రూరల్ అడవి తక్కెళ్ళపాడు, గొర్లవారిపాలెం, తాడికొండ మండలం ఫనిధరం, దామరపల్లి, పొన్నెకల్లు గ్రామాల్లో రైతు సంఘాల బృందం పర్యటించింది. రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కె.అజయ్, నాయకులు కొల్లి రంగారెడ్డి, కంజుల విఠల్‌రెడ్డి, నిమ్మగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రయాణికునిపై దాడి

సెల్‌ఫోన్, నగదు అపహరణ

ప్రజాశక్తి - తెనాలి

ప్రయాణికుడిని నమ్మించి అతనిపై దాడి చేసి సెల్ఫోన్, నగదు అపహరించి దుండగులు ఉడాయించారు. సేకరించిన వివరాల ప్రకారం కొల్లూరుకు చెందిన పి.శివప్రసాద్ ఆదివారం రాత్రి హైదరాబాదు నుండి తెనాలి వచ్చాడు. కొల్లూరు వెళ్లేందుకు బస్టాండ్ వద్ద వేచి ఉండగా ఇరువురు వ్యక్తులు బైక్ పై వచ్చి, తాము కూడా కొల్లూరు వెళుతున్నట్లు నమ్మించారు. వారి మాటలు నమ్మి శివప్రసాద్ వారి ద్విచక్ర వాహ నంపై ఎక్కాడు. కూచిపూడి లాకుల వరకు వెళ్లిన తర్వాత ఇరువురు దుండగులు శివప్రసాద్ పై దాడి చేసి, అతని వద్ద నగదు, సెల్ఫోన్ లాక్కు న్నారు. ప్రతిఘటించే ప్రయత్నం చేసిన శివ ప్రసాదును పక్కనే ఉన్న కాలువలోకి నెట్టి పరా రయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేపట్టారు.

పురపాలక సంఘ కార్యాలయము సత్తెనపల్లి

ఆర్.ఓ.సి.నెం. 113/2021/ఎ1 తేది.28-04-2025

షాపు రూముల బహిరంగ వేలము ప్రకటన

సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో గల (1) N.T.R. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెంబర్లు 3,6,7,8,9,10,11,12,13,14,15,18,19,20,21,22,23,24,25,26,27,28,29,30,32,33,34,35,36,37 మరియు 39 (2) శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య కాంప్లెక్స్ నందలి షాపులు 1,2,3,4,5,7,8,10,16, ఫస్ట్ ఫ్లోర్ మరియు సెకండ్ ఫ్లోర్ ఓపెన్ హాల్ (3) శ్రీ వై.వి.రెడ్డి మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపులు 8,14,15,16,17,18 మరియు బి బ్లాక్ (4) శ్రీమతి గంటా సరస్వతి & రోశయ్య మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు రూము నెం.2 (5) రాజీవ్ గాంధి కూరగాయల మార్కెట్ నందలి 3,4,5,8,17,18,19,27, 28,29,30,38,39,40,41 మరియు 42 షాపులు నిర్ణయించిన నెలసరి అద్దె పై బహిరంగ వేలమును తేది. 14-05-2025న బుధవారం ఉదయం 11.00 గంటలకు మునిసిపల్ కార్యాలయము నందు మునిసిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. సదరు బహిరంగ వేలమునకు సంబంధించిన పూర్తి వివరములు కార్యాలయము పనిచేయు వేళలలో రెవిన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

సం॥ కమీషనరు
సత్తెనపల్లి పురపాలక సంఘం

రాష్ట్రంలో దళితులకు రక్షణ లేదు

కాంగ్రెస్ మాచర్ల ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడిగా కొనసాగుతున్న తిప్పగిరి లక్ష్మీనారా యణ హత్యకు గురవటంతో మాచర్ల కాంగ్రెస్ శ్రేణులు ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి హత్యను తీవ్రంగా ఖండించారు. రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ లక్ష్మీనారాయణ ఇంటి దగ్గర పోలీస్ పికెట్ కొనసాగు తున్నా ఆయన హత్యకు గురైయారంటే పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోం దన్నారు. హత్యకు టిడిపి నాయకులే కారణమని ఆరోపణలు ఉన్నాయని, ప్రభుత్వం తక్షణం బాధిత కుటుంబానికి పది లక్షలు నష్టపరిహారం అందించాలని, దోషులను కఠినం గా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీని యర్ నాయకులు రాగిడి ప్రతాప్ బాబు, మండలపార్టీ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, ఆదాము, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

దావా సమను

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, సత్తెనపల్లి.
ఓ.యస్.నెం. 622/2022

బిట్వీన్
శానంపూడి శ్రీధర్‌రెడ్డి ....వాది
మరియు
సోమేపల్లి నరసింహారావు ... ప్రతివాది
టు :
సోమేపల్లి నరసింహారావు, తండ్రి : పున్నయ్య, నివాసం : డోర్ నెం. 15-10-11, వడ్డవల్లి, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నాను. మీరు సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 03-5-2025న వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసు కొనవలసినదిగా యిందుమూలంగా తెలియజేయట మైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 3-5-2025

సత్తెనపల్లి. **ఇట్లు.**
పి.వి.నరసింహశాస్త్రి,
అద్వకేట్, సత్తెనపల్లి.

దావా సమను

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, సత్తెనపల్లి.
ఓ.యస్.నెం. 220/2023

బిట్వీన్
వనమా నాగమల్లేశ్వరరావు ....వాది
మరియు
సొలస హనుమంతరావు ... ప్రతివాది
టు :
సొలస హనుమంతరావు, తండ్రి : వెంకటేశ్వర్లు, నివాసం : హుస్సేన్ నగరం గ్రామం, పెదకూరపాడు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నాను. మీరు సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది.07-5-2025న వాయిదా వేసి యున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసు కొనవలసినదిగా యిందుమూలంగా తెలియజేయట మైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 07-5-2025

సత్తెనపల్లి. **ఇట్లు.**
పి.వి.నరసింహశాస్త్రి,
అద్వకేట్, సత్తెనపల్లి.

దావా సమను

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, సత్తెనపల్లి.
ఓ.యస్.నెం. 625/2022

బిట్వీన్
శానంపూడి రవీంద్రరెడ్డి ....వాది
మరియు
సోమేపల్లి నరసింహారావు ... ప్రతివాది
టు :
సోమేపల్లి నరసింహారావు, తండ్రి : పున్నయ్య, నివాసం : డోర్ నెం. 15-10-11, వడ్డవల్లి, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నాను. మీరు సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది.09-5-2025న వాయిదా వేసి యున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసు కొనవలసినదిగా యిందుమూలంగా తెలియజేయట మైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 09-5-2025

సత్తెనపల్లి. **ఇట్లు.**
పి.వి.నరసింహశాస్త్రి,
అద్వకేట్, సత్తెనపల్లి.

దావా సమను

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు, సత్తెనపల్లి.
ఓ.యస్.నెం. 218/2023

బిట్వీన్
వనమా శ్రీనివాసరావు ....వాది
మరియు
సొలస హనుమంతరావు ... ప్రతివాది
టు :
సొలస హనుమంతరావు, తండ్రి : వెంకటేశ్వర్లు, నివాసం : హుస్సేన్ నగరం గ్రామం, పెదకూరపాడు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నాను. మీరు సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది.12-5-2025న వాయిదా వేసి యున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసు కొనవలసినదిగా యిందుమూలంగా తెలియజేయట మైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 12-5-2025

సత్తెనపల్లి. **ఇట్లు.**
పి.వి.నరసింహశాస్త్రి,
అద్వకేట్, సత్తెనపల్లి.

యువకుని వ్యక్తి హత్య

ప్రజాశక్తి - తెనాలి

పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఘటన స్థలాన్ని పరిశీలించిన త్రి టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం మల్లిపాడు పంచాయతి పరిధిలోని వెలాగ గుంట చెరువులో ఆదివారం రాత్రి దుండగులు గుర్తు తెలియని వ్యక్తిని మెడ చుట్టూ, తల మీద కత్తులతో పొడిచి హత్య చేశారు. మృతుని వయస్సు 25 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండవచ్చునని భావించగా అనంతరం మృతుడు జగ్గడిగుం టపాలెం టిడ్కో గృహ సముదాయానికి చెందిన వ్యక్తిని, కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగిందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 24X7 వైద్య సేవలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మొదటిసారిగా 24x7 న్యూరో సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మెదడు, నరాలకు సంభందించిన వ్యాదులకు ప్రముఖ నరాల వైద్య నిపుణులు డాక్టర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నడుము నొప్పి, తల తిరుగుట, తలనొప్పి, మెదడులో నీరు చేరుట, మైగ్రేన్, తిమ్మిరులు, పక్షవాతం, శరీరం జలదరింపు, బ్రెయిన్ స్ట్రోక్, మెదడులో కణతలు తదితర వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తారని అన్నారు. కుట్లు లేకుండా అత్యాధునిక వైద్య పరికరాలతో కార్పొరేట్ వైద్యం, లాప్రోస్కోపిక్ సర్జరీలు తమ హాస్పిటల్‌లో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ, గైనకాలజీ, ముక్కు చెవి గొంతు, యూరాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. నరసరావుపేట, వినుకొండ, పిడుగురాళ్ళ, మాచర్ల పరిసర ప్రాంతాల వారు ఈ సేవలను ఉపయోగించుకోవాలని, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంతో పాటు అన్ని ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీల నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన కెవి విద్యార్థికి సత్కారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నా ప్రత్తిపాటి అంకిత్‌పాల్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం దక్కింది. 18 దేశాల్లో 1046 మందితో స్వరాలు ఆలపించి గిన్నిస్ బుక్ రికార్డును అంకిత్‌పాల్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యుదయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో అంకిత పాల్‌ను సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ఎం.మల్లికార్జున్‌రావు, డి.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, పి.పూర్ణచంద్రరావు, కె.వాసు, షేక్ జాకీర్, పి.ఆంజనేయులు, షేక్ ఖాజావలి, సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

ప్రైవేటు పాఠశాలలలో ఒకటవ తరగతిలో చేరేందుకు పేద విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈఓ-1 సయ్యద్ జఫరుల్లా సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)సి ప్రకారం దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న పేద పిల్లలను ప్రైవేటు పాఠశాలలలో ఉచితంగా చేర్చుకోవాలని, దానిలో భాగంగా షెడ్యూల్ కులాలు 10 శాతం, షెడ్యూల్ తెగలు 4 శాతం, బలహీనవర్గాలు, మైనార్టీలు 6 శాతం, అనాధలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవి బాధితుల పిల్లలకు 5 శాతం చేరేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, పాస్‌ఫొటోలతో 2వ తేదీ నుండి 19 వరకు cse.ap.gov.in వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉద్యోగాల ఆశ చూపి మోసం

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు, వికలాంగుని వద్దకు వచ్చి సమస్య వింటున్న ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి పరిష్కారానికి పోలీసు సిబ్బంది కృషి చేయాలని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి 73 ఫిర్యాదులు స్వీకరించారు.

విదేశాలలో ఉద్యోగం పేరిట రూ.15 లక్షల మోసం

బీటెక్ పూర్తి చేసిన తన తమ్ముడు ప్రశాంత్‌కు విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని నరసరావుపేటకు చెందిన తుపాకుల హనుమంతరావు విడతల వారీగా రూ.15 లక్షలు తీసుకున్నాడనాడని నరసరావుపేట పట్టణం పెద్ద చెరువుకు చెందిన నడికుడి పాపారావు ఫిర్యాదు చేశారు. తన తమ్ముణ్ణి హనుమంతరావు విదేశాలకు పంపకపోవడంతోపాటు డబ్బులు కూడా తిరిగి ఇవ్వకుండా రెండేళ్లుగా ఇబ్బంది పెడుతున్నాడని, ప్రశ్నిస్తే చంపేస్తానని బెదిరిస్తున్నాడని వాపోయాడు.

నర్సు ఉద్యోగమని రూ.3 లక్షల మోసం

ప్రభుత్వ పెద్దలు తమకు తెలుసునని, పల్నాడు జిల్లాలో ప్రభుత్వ హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి విజయవాడకు చెందిన రెడ్డి గౌతమ్, పెద్దపులి శ్రీనివాసరెడ్డి రూ.3 లక్షలు తీసుకుని మోసం చేసారని దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి చెందిన కోట సంధ్యారాణి ఫిర్యాదు చేశారు.

కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తానని...

గుంటూరు జిల్లా కోర్టులో జడ్జి వద్ద పని చేస్తున్నానని నమ్మించి తనకు అదే కోర్టులో ఖాళీగా బెంచ్ గుమస్తా ఉద్యోగం ఇప్పిస్తానని దరఖాస్తు చేయించి చివరగా జడ్జ్ సిఫార్సు కావాలని... ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కొంత అప్పుగా ఇవ్వాలని నమ్మించి రూ.4.60 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు చిలకలూరిపేట పట్టణం వడ్డెరపాలేనికి చెంది. పల్లెపు లక్ష్మీదుర్గపై అదే ప్రాంతానికి చెందిన అన్నపురెడ్డి సత్యవతి ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇచ్చిన తర్వాత ఉద్యోగం రాకపోవడంతో ఆమె గురించి విచారణ చేయగా ఆమెకు ఉద్యోగం లేదని తెలిసిందని చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోవడంతోపాటు తనకు న్యాయం చేయాలని కోరారు.

భర్త, అత్తమామలపై మహిళ ఫిర్యాదు

ప్రేమ వివాహం చేసుకున్న గుంటూరుకు చెందిన భర్తతోపాటు అతని తల్లిదండ్రులు వేధిస్తున్నారని దాచేపల్లి మండలం భట్రుపాలెం గ్రామానికి చెందిన బాణావత్ దివ్యభారతి ఫిర్యాదు చేశారు. వారి వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చి ఉంటున్నానని, అయినా గుంటూరు కోర్టులో అటెండర్‌గా పని చేస్తున్న భర్త ఏదోవిధంగా తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కలెక్టర్ స్పందనకు 168 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి 168 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తోపాటు డిఆర్ఒ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను జయంప్రదం చేయండి : సిపిఎం

20న సమ్మెకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - వినుకొండ

ఒకటో తేదీన జరిగే మేడే ఉత్సవాల్లో కార్మికులు, కర్షకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు కోరారు. సిపిఎం విస్తృత సమావేశం స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశానికి కె.శివరామకృష్ణ ఆధ్యక్షత వహించగా గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న జరిగే సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని, సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. పెరుగుతున్న నిత్యావసరధరలు తగ్గించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, పంటలకు మద్దతు ధరలు కల్పించాలని సాగే సమ్మెలో కార్మికులతోపాటు కర్షకులూ పాల్గొనాలన్నారు. సమావేశంలో తొలుత ఉగ్రదాడుల్లో మృతులకు నివాళులర్పించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు కె.హనుమంతరెడ్డి, ఆశీర్వాదం, కోటిరెడ్డి, రంజాన్ బి, తిరుమల లక్ష్మి, కరిముల్లా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

ఇష్టమైన అంశాల్లో శిక్షణతో సృజనాత్మకత పెరుగుదల

బాసట ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం - 200 మంది హాజరు

ప్రజాశక్తి - యడ్లపాడు

బాసట (సామాజిక సాంస్కృతిక వేదిక) యడ్లపాడు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం ప్రారంభమైంది. ప్రారంభ సభకు విద్యా కమిటీ కన్వీనర్, ఉపాధ్యాయులు కల్లూరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎండోమెంట్ మాజీ డిప్యూటీ కమిషనర్ గంగయ్య చౌదరి, రిటైర్డ్ లెక్చరర్ జొన్నలగడ్డ శేషయ్య మాట్లాడారు. పిల్లలకు ఇష్టమైన అంశాలపై శిక్షణిస్తే వారిలో సృజనాత్మక పెరుగుతుందన్నారు. వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందించటం ఒకటే కాకుండా వారి మానసిక పరిపక్వత పెంపొందించడానికి ఉపయుక్తమని చెప్పారు. నూతన ఆలోచనలు పెంచడానికి, ఆవిష్కరణ చేయటానికి తద్వారా సామాజిక అభివృద్ధిలో వారు భాగస్వాములు కావటమే శిబిరం ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల సూచించారు. శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి 200 మంది విద్యార్థులు హాజరవగా వారికి నోట్ బుక్, పెన్ను అందించారు. కార్యక్రమంలో బాసట అధ్యక్ష కార్యదర్శులు నూతలపాటి కాళిదాసు, సామినేని శ్రీనివాసరావు, సభ్యులు కేత రామబ్రహ్మం, ముత్తవరపు రవీంద్రబాబు, పోపూరి శ్రీనివాసరావు, రావి సురేష్‌బాబు, బందెల పీటర్, లింగరావుపాలెం జెడ్పీ హైస్కూల్ పర్యవేక్షకులు నంబూరి శివరామకృష్ణ, పారిశ్రామికవేత్త నంబూరి శ్రీనివాసరావు, నారాయణ స్కూల్ డైరెక్టర్ పోపూరి వెంకటేశ్వర్లు, స్కూల్ ప్రిన్సిపల్ చెరుకూరి సృజన, వేసవి శిక్షణ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శిబిరం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న అతిథులు

వాటర్ గ్రిడ్ ట్యాంకుల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- రెంటచింతల

ప్రతి ఇంటికీ కృష్ణాజలాలను అందించడానికి జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను గుర్తించేందుకు వివిధ శాఖల అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. ఈ పథకం ద్వారా రెంటచింతల మండలానికి రూ.75 కోట్ల మంజూరయ్యాయి. మొదట పాల్వాయి గేటులో ఓహెచ్బిఆర్ నిర్మించాలని భావించినా ఇప్పుడు 2.5 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో జమ్మలమడకలో నిర్మించబోతున్నారని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్ చెప్పారు. గోలి, మిట్టగుడిపాడు, పాలువాయి పసర్లపాడు, కొత్తపాలువాయి, పాలువాయి జంక్షన్, జెట్టిపాలెం తుమృకోట తదితర గ్రామాల్లోని స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీకి చెందిన ఉన్నత స్థాయి ఇంజినీరింగ్ బృందంతో పాటు పాల్వాయి సర్పంచి ఎం.విజయలక్ష్మి లచ్చిరెడ్డి వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బుగ్గ వాగు రిజర్వాయర్ క్రస్ట్‌గేట్లు మరమ్మతులకు రూ.60 లక్షలు విడుదల : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మండల కేంద్రమైన రెంటచింతలకు సోమవారం వచ్చిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్థానిక తుమ్మ జోజిరెడ్డి నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. బుగ్గ వాగు రిజర్వాయర్కు సంబంధించి రెండు, నాలుగు క్రస్టు గేట్ల మరమ్మతులకు ఎన్‌డిఆర్ఎఫ్ (రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధి) నుంచి రూ.60 లక్షలు విడుదల చేశారని, ఆ నిధులను అదనంగా మరో రూ.20 లక్షలు కావాలని తాము కోరునట్లు చెప్పారు. 1967లో కాల్వలకు సాగునీరు విడుదల చేశారని, అప్పటినుంచి 58 ఏళ్లలో పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని అన్నారు. సమావేశంలో నీటి సంఘ అధ్యక్షులు తుమ్మ జోజిరెడ్డి, టిడిపి టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, రాయపరెడ్డి, అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత చేరువ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాబోయే రోజుల్లో రెవిన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు మండల తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజా సమస్యలపై గోపాలకృష్ణ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా నాలుగు అర్జీలు స్వీకరించామన్నారు. సర్వే పరమైన సమస్యలు రెండు, నేలపాడుకు చెందిన పూర్ణకుమారి తమ పంట పొలంలోకి వెళ్లే డొంకమార్గం ఆక్రమణకు గురైందని ఒకటి, స్మశాన వాటిక విస్తరణకు కావాల్సిన పొలం ప్రభుత్వానికి ఇస్తామంటూ ముందుకొచ్చిన రైతు రాధాదేవి

ఆర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మార్వో గోపాలకృష్ణ

అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ఇకపై గ్రామస్థాయిలో సమస్యలను స్థానిక విఆర్ఓ లు ద్వారా ప్రతి శనివారం స్వీకరించేలా చర్యలు చేపట్టబోతున్నట్లు చెప్పారు. సేకరించిన అర్జీలను విఆర్ఓ లు పిజిఆర్ఎస్‌లో సమర్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ పదేపదే తిరగకుండా అర్జీదారులపై పడనున్న శ్రమ, ఆర్థిక భారాన్ని కొంతవరకూ తగ్గించవచ్చన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డును ఈకెవైసి ద్వారా అనుసంధానం చేయించాలన్నారు. 5ఏళ్ళు లోపు చిన్నారులు, 80 ఏళ్ళు పైబడిన వఅద్ధులు మినహా ఏప్రిల్ 30 లోగా ఈకెవైసి ప్రక్రియ పూర్తిచేయించుకోవాలని సూచించారు. ఈకెవైసి సేవలకు మీ దగ్గర్లో ఉన్న ఎండిఓ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు, విఆర్ఓ లు, ఎమ్మెర్వో కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. ఈకెవైసి చేయించనిదే రేషన్ పొందలేమన్న అపోహలను నమ్మవద్దన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తదితరులు

ఏర్పాట్లను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మే 2వ తేదీన అమరావతి రాజధాని నిర్మాణ పనులను పున్ణ ప్రారంభించేందుకు అమరావతి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సోమవారం సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ శాఖ కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ కె.శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీనివాస మూర్తి,రెవెన్యూ,పోలీస్ శాఖ అధికారులు పాల్గన్నారు.

రహదారుల పనులు ముమ్మరం..

ప్రధాని మోడీ రాజధాని పనుల పున్ణ ప్రారంభానికి మే 2 న రానున్నారు. ఆయన రాకకు కొద్ది రోజులు మాత్రమే సమయం ఉండడంతో రహదారుల నిర్మాణ పనులు ముమ్మర మయ్యాయి. వెలగపూడిలోని సచివాలయం వెనుక వైపు బహిరంగ సభ జరగనుంది. దీంతో సభా వేదిక వద్దకు వెళ్లేందుకు వీలుగా రహదారులను నిర్మించడం, మరమ్మత్తులు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. పగలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పనులకు ఇబ్బందికరంగా ఉంటోంది. దీంతో రాత్రి వేళల్లో కూడా రోడ్డు పనులు చేసేందుకు వీలుగా విద్యుత్ లైట్లు అమర్చుతున్నారు.

కార్మికుడి కుటుంబానికి పరిహారం

ప్రజాశక్తి - గుంటూరు

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలకసంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగం, వెహికిల్ షెడ్‌లో ఔట్సర్సింగ్ కార్మికుడు నాగిపోగు నాగరాజు కుటుంబ సభ్యులు కుమారికి ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15వేలకు సంబంధించిన చెక్‌ను సోమవారం కమిషనర్ చాంబర్‌లో అందించారు. పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరిండెంట్లను ఆదేశించామని తెలిపారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - గుంటూరు

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 30న, గుజ్జనగుండ్ల సర్కిల్ వద్ద ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎన్ఆర్ పాలీమర్స్, జిఎం క్యూఆర్ కోడ్ సర్వీసెస్, సైనెట్ ఎలక్ట్రికల్స్, అనూ హాస్పిటల్స్, ఫెయిర్ డీల్ క్యాపిటల్, 7హిల్స్ ఫార్మసీ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గంటున్నాయన్నారు. కావున టెన్త్, ఇంటర్,, డిగ్రీ, బి.టెక్, ఎంబిఎ, పీజీ పూర్తి చేసి, 18-35 ఏళ్ల వయస్సు కలిగిన వారు, తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో నేరుగా ఇంటర్యూకు హాజరు కావచ్చన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకూ ఇంటర్యూలు జరుగుతాయన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజాశక్తి - పెదకాకాని

నేటి సమాజంలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం క్రీడాకారులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని ఇండియన్ ఆర్చరీ క్రీడాకారుడు కొండూరు వెంకటాద్రి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్శిటీ నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంతర్ కళాశాల నందు నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు వివిఐటియూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్‌తో కలసి పురస్కారాలు, ప్రశంస పత్రాలను అందించారు. ముఖ్య అతిధి కె. వెంకటాద్రి మాట్లాడుతూ క్రీడలలో రాణించిన వారు చదువులో కూడా ముందజలో ఉంటారని అన్నారు.

క్రీడలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులతో కళాశాల ఛైర్మన్ విద్యాసాగర్, వెంకటాద్రి

ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, డీన్ డాక్టర్ కె. సత్యన్నారాయణ, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ ఎన్.అరుణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతే రాష్ట్ర రాజధాని : మంత్రి నాదెండ్ల

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

అమరావతే రాష్ట్ర రాజధాని అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో రామాలయం సెంటర్ వద్ద రవి చెట్టు కింద జనసేన పార్టీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ మరియు మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షత వహించారు. రచ్చబండలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, "జనసేన పార్టీ ఇప్పుడు ప్రశ్నించే పార్టీగా మాత్రమే కాకుండా సమస్యలను పరిష్కరించే స్థాయికి ఎదిగింది" అని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రతి సమస్యను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములుగా

మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

చేసుకుంటామని స్పష్టం చేశారు. మే 2న అమరావతిలో జరుగబోయే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సభను పండుగ వాతావరణంలో విజయవంతం చేయాలని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎర్రబాలెం, బేతపూడి, అయినవోలు గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

"మానాన్నపసివాడే" షార్ట్ ఫిల్మ్‌కు బహుమతి

ప్రజాశక్తి- తాడేపల్లి

డాక్టర్ కెకెఆర్ వ్యాలీ వారు నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025లో ఉండవల్లి గ్రామానికి చెందిన గాదెనాగభూషణం రచన, దర్శకత్వంలో త్రినేత్ర ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో రూపొందిన "మానాన్న పసివాడే" షార్ట్ ఫిల్మ్‌కు బహుమతి దక్కింది. కెకెఆర్ వ్యాలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ షార్ట్ ఫిల్మ్ పోటీల లో రెండు తెలుగురాష్ట్రాల నుండి 96 షార్ట్ ఫిల్మ్ఌ ఎంట్రీస్ రాగా జ్యూరీ వాటి లోని టాప్ 10 ఉత్తమ చిత్రాలను ఎంపిక చేశారు. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన టాప్10 ఉత్తమ చిత్రాలను ఆగిరిపల్లి లోని కెకెఆర్ వ్యాలీ స్కూల్ థియేటర్‌లో ప్రదర్శించిన అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ పోటీల లో గాదెనాగభూషణం దర్శకతవంలో రూపొందిన "మానాన్న పసివాడే" షార్ట్ ఫిల్మ్ జ్యూరీ బహుమతిని గెలుపొందింది. షార్ట్ ఫిల్మ్ పోటీల నిర్వాహకులు కొసరాజు కోటేశ్వరరావు చేతులమీదగా షీల్డ్, సర్టిఫికెట్లు, నగరదు అందజేశారు. కాగా ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వ కందుకూరి విశిష్ట పురస్కారం అందుకున్న గాదెనాగభూషణం రచన, దర్శకత్వం లో రూపొందిన "మానాన్న పసివాడే" షార్ట్ ఫిల్మ్‌కు బహుమతి దక్కటం పట్ల కళాకారులు, ఉండవల్లి గ్రామ ప్రజలు గాదె నాగభూషణం ను అభినందనలు తెలియజేస్తున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కుమార్ పంప్స్ కాలనీ లోని సరస్వతి శిశు మందిర్ లో వివిధ తరగతులలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానోత్సవం సోమవారం నిర్వహించారు. డాక్టర్ సామల లక్ష్మణ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇస్రో మాజీ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కోడూరు రమాదేవి, మండల విద్యాధికారి డాక్టర్ మేకల

లక్ష్మీనారాయణ, సరస్వతీ విద్యా పీఠం విజయవాడ సమితి సభ్యులు సన్నిధి వెంకట సుబ్బారావు, పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు వై హనుమంతరావు, కోశాధికారి అవ్వారు లత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్లను మంజూరుకు వినతి

ప్రజాశక్తిౖగుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా మరికొన్ని అర్బన్ హెల్త్ సెంటర్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే గళ్ళామాధవి కోరారు. ఈమేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పేరున రాసిన వినతిపత్రాన్ని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబుకు సోమవారం వెలగపూడి సచివాలయంలో అందించారు. పలు అర్బన్ పిహెచ్‌సిలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ఎటి అగ్రహారం, కోబాల్టు పేట, ఎస్‌విఎన్ కాలనీలో కొత్తగా మంజూరు చేయాలని, అలాగే తుపాను నగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రి భవనాలను తిరిగి నిర్మించాలన్నారు. ఈమేరకు పలు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 25 మంది ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 25 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.పాముల రెడ్డి తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ సిస్టర్ జి.నిర్మల జ్యోతి మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మెడ్ ప్లస్ ఫార్మసీ ప్రతినిధి బి. జయకర్ రాజా, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎం ప్రశాంతి సమన్వయకర్తలు బి.జోజి బాబు సిహెచ్ భార్గవ్ గోపి పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఫౌండేషన్ వితరణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పార్లమెంటు పరిధిలోని కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాల నిమిత్తం విరాళం అందిస్తున్న దాతలు సూదనగుంట కళ్యాణి ప్రసాద్, సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్‌లను సోమవారం సాయంత్రం కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా పలు ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మించడం ముదావహం అన్నారు. టిడిపిలో పొలిట్ బ్యూరో సభ్యులుగా, తానా అధ్యక్షులుగా, లెఫ్టినెంట్ కమాండర్‌గా రాఘవేంద్ర ప్రసాద్ ఇతోధిక సేవలు చేశారని అన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్యే బి. రామాంజనేయులు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీ టెక్నికల్ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు వడ్రాణం హరిబాబు,నిమ్మల శేషయ్య పాల్గొన్నారు.

విజ్ఞానంతో పాటు వినోదం అవసరం

ప్రజాశక్తి- తాడేపల్లి

పిల్లలకు విజ్ఞానంతో పాటు వినోదం కూడా అవసరమని మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి చెప్పారు. తాడేపల్లి బైపాస్ రోడ్డు అమరావతి ఐకాన్‌లో సోమవారం నుండి మే 12వ తేదీ వరకు అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ఈ అవకాశాన్ని అపార్ట్మెంట్ వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఐకాన్ నుండి వై సుబ్బారావు, ముఖేష్, మనోహర్ రెడ్డి, ప్రముఖ డాన్స్ మాస్టర్ చందు, పెద్దలు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌గా షేక్ మదార్ సాహెబ్ ఎన్నిక

నిరంకుసత్వం నుంచి ప్రజాస్వామ్యం వైపు : ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మదార్‌సాహెబ్‌కు డిక్లరేషన్ ఫామ్‌ను అందిస్తున్న ఎన్నికల అధికారి, జెసి సూరజ్ ధనంజయ్

ప్రజాశక్తి - మాచర్ల :

మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా 27వ వార్డు కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సోమవారం వైస్ చ్కెర్మన్ ఎన్నిక నిమిత్తం కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశానికి 31 కౌన్సిలర్లుకు గాను 21 మంది హజరైనారు. ఎన్ని కల అధికారిగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ అధ్యక్షత సమావేశం జరిగింది. వైస్ చైర్మన్‌కు నామినేషన్స్ కోరగా 27వవార్డు కౌన్సిలర్ షేక్ మదార్‌సాహెబ్ పేరును మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహరావు ప్రతిపాదించగా, కౌన్సిలర్లు గట్ల అరుణ కుమారి, ముదిశెట్టి శ్రీనివాసరావులు బలపరిచారు. మరొకరి ప్రతిపాదన రాకపోవటంతో వైస్ చైర్మన్‌గా షేక్ మదార్‌సాహెబ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ ప్రకటించారు. మదార్‌సాహెబ్‌కు వైస్ చైర్మన్‌గా డిక్లరేషన్ ఫామ్ అందజేశారు. అనంతరం మదార్ సాహెబ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి ఎక్స్ అఫీసీయో మెంబర్‌గా హాజరైన ఎమ్మెల్యే జూలకంటి మదార్ సాహెబ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ మురళికృష్ణ, కమిషనర్ డి. వేణుబాబుపాల్గొన్నారు. పోలీసులు కౌన్సిలర్ల ఐడిలను చూసి కౌన్సిల్‌లోకి పంపారు. విలేఖరుల మినహా ఇతరులను కౌన్సిల్ హాల్‌లోకి అనుమతించలేదు. డిఎస్‌పి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీలో చేరిన 17 మందికి తోడు మరో నలుగురు వైసిపి కౌన్సిలర్ల సమావేశానికి హజరైనారు.

నిరంకుసత్వం నుంచి ప్రజాస్వామ్యం వైపు : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వైసిపి ప్రభుత్వం హయాంలో మాచర్ల మున్సిపాలిటీలో నిరంకుసత్వం రాజ్యమేలిందని ఎమ్మెల్యే జూలకంటి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో నామినేషన్ వేయడానికి వచ్చిన టిడిపి, బిజెపి, జనసేన నాయకులపై దాడులు, కేసులు పెట్టి మరి 31 వార్డుల్లో 31 మంది వైసిపి నాయకులను కౌన్సిలర్‌గా ఏకగ్రీవం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 నెలల కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి కౌన్సిలర్లు స్వచ్ఛందంగా టిడిపిలో చేరుతున్నారని పేర్కొన్నారు. మాచర్ల మున్సిపాలిటీ సర్వతో ముఖంగా అభివద్ధి సాధించే దిశగా కౌన్సిల్ పనిచేయాలని సూచించారు.

మదార్‌సాహెబ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి, చైర్మన్ పోలూరి, కౌన్సిలర్లు

ఇచ్చిన మాటకు కట్టుపడి ఉంటారు : వైస్‌చైర్మన్ మదార్ సాహెబ్

జూలకంటి నాగిరెడ్డి, దుర్గాంబల హయాం నుంచి జూలకంటి కుటుంబం ప్రజలకు కట్టుబడి ఉంటుందని వైస్ చైర్మన్ మదర్ సాహెబ్ పేర్కొన్నారు. ఆ వారసత్వం నుంచి వచ్చిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తనకు వైస్ చైర్మన్ పదవీని కానుకగా ఇచ్చారని తెలిపారు. అనంతరం మదార్ సాహెబ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జూలకంటికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థిని సన్మానిస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

10వ తరగతి విద్యార్థికి ఘన సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

2024-2025 సంవత్సరం 10వ తరగతి పరీక్ష ఫలితాలలో విద్యా వికాస్ హై స్కూల్ విద్యార్థి దత్తలూరి సైదావలి 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో వినుకొండ నియోజకవర్గం నూర్ బాషా సంఘం వారి ఆధ్వర్యంలో విద్యార్థి దత్తలూరి సైదావలిను నూర్ బాషా సంఘం వారు దుష్యాలువా, పూలమాలలతో సత్కరించారు. లాయర్ సిద్దయ్య మాట్లాడుతూ నియోజక వర్గంలోని అలీబాయి పాలెం గ్రామానికి చెందిన దత్తలూరి మీరావలి 10వ తరగతి పరీక్ష ఫలితాలలో 589 మార్కులు సాధించడం జరిగిందని ఇదేవిధంగా తదుపరి ఉన్నతమైన చదువులలో కూడా మంచి మార్కులు సాధించి ఉన్నతమైన జీవితంలో స్థిర పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లాయర్ షేక్. సిద్దయ్య, ఏల్చూరు మస్తాన్, ఆర్మీ ఈశ్వరయ్య, పెద్దవరం పెద్ద కాసిం, దత్తలూరి మీరావలి, ఎస్.కె అంజి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులు పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వకర్మలకు అందిసున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ విశ్వబ్రాహ్మణ రాష్ట్ర సాధికారిక సమితి కో-కన్వీనర్ సింహాద్రి కనకాచారి ఆదేశానుసారం, తెలుగుదేశం పార్టీ విశ్వబ్రాహ్మణ రాష్ట్ర సాధికారిక సమితి సభ్యుడు సంబోజువేణు , మాచర్ల నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సాధికారిక సమితి కన్వీనర్ తేనెపల్లి శ్రీనివాసచారి ఆధ్వర్యంలో పట్టణంలో విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి విశ్వబ్రాహ్మణులకు అండగా వుంటామని చెప్పారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, ఎనుమల కేశవరెడ్డి, విద్యాధరణి మురళి, బీసీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మున్నా రాంబాబు యాదవ్ పాల్గొన్నారు.

చెన్నకేశవరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరవింద్‌బాబు

సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి చెన్నకేశవరావుకు ఘనసన్మానం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

మాచర్ల పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి చెన్నకేశవరావును నరసరావుపేటలో ఆదివారం ఘనంగా సన్మానించారు. వాసవి అన్నదాన నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ నిర్వాహకులు బత్తుల మురళి తల్లిదండ్రులైన భత్తుల వెంకట రత్నం, అచ్చమాంబ జ్ఞాపకార్థంతో పాటు తన తండ్రి తెలుగు వెలుగు వారపత్రికను 25 సంవత్సరాల పాటు నడిపించినందుకు గుర్తుగా జర్నలిస్టులను గౌరవించి పల్నాడు జిల్లా పరిధిలోని 50మంది జర్నలిస్టులకు ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాచర్ల నుండి సీనియర్ జర్నలిస్ట్ ఓరుగంటి చెన్నకేశవరావును సన్మానించారు.

రైతు తలసరి ఆదాయంలో అగ్రస్థానమే చంద్రబాబు ఆశయం

- రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీలో జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

రైతుల తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ఆ లక్ష్యం చేరుకోవడానికే రాయితీపై యంత్రపరికరాలు, సేంద్రియ సేద్యం వంటి నిధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. వినుకొండ పట్టణం మార్కెట్ యార్డులో సోమవా రం రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ డ్రోన్ల సాయంతో ఎరువులు వేయడం రైతులకు లాభ సాటిగా ఉందని, అందుకే 80శాతం రాయితీతో వాటిని అందిస్తున్నామన్నారు. డ్రోన్ ఖరీదు రూ. 10 లక్షల ఖరీదు ఉంటే రూ.8లక్షల వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు వెల్లడించారు. అందులో కేంద్రం 50 శాతం భరిస్తోందన్నారు. సేంద్రియ సాగుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఇస్తున్నామని, రైతులు కూడా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా ఈ రంగంలో ముందుకు వెళ్లాలని సూచించారు.. ఆరోగ్య కరమైన పంట లతో ప్రజలఆరోగ్యాలకు కూడా మేలు జరుగుతుందన్నారు. మంచిదిగుబడులు, ఆదాయం ఇచ్చే ఉద్యాన పంటల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయ కులు నాగ శ్రీను రాయల్, లగడపాటి వెంకట్రావు, ముంద్ర సుబ్బారావు, మీసాల మురళీకష్ణ, గోవింద నాయక్, బచ్చు అంజిరెడ్డి, పత్తి పూర్ణచంద్రరావు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యశించి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగి చదువుకున్న పాఠశాలకు, తల్లి దండ్రులకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విద్యార్థులకు సూచిం చారు. నరసరావుపేట పట్టణంలో నవోదయ నగర్‌లోని హిందూ స్కూల్ విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా సోమవారం హిందూ స్కూల్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై, 10పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హిందూ స్కూల్ అధినేత పోపూరి వెంకటరావు, కరస్పాండెంట్ శివ ప్రియ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన లోపంతో ఆర్థిక మోసాలు: సిఐ చరణ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆర్థిక మోసాలకు ప్రధాన కారణం మనిషి నిర్లక్ష్య వైఖరి, అవగాహన లోపమేనని 1వ పట్టణ సిఐ ఎంవి. చరణ్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం విజయ్ కళ్యాణమండపంలో వ్యాపారులకు ఆర్థిక మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అత్యాశకు, ప్రలోభాలకు లోనై అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం, ఆన్ లైన్ గేమ్స్ ఆడటం ద్వారా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అప్పు తీసుకున్న వారు అప్పు ఏ విధంగా ఎగ్గొట్టాలని ఆలోచిస్తారన్నారు. ట్రాఫిక్ సిఐ లోకనాథం మాట్లాడుతూ ఆన్లైన్ ట్రాన్స్ఫర్స్ చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విద్యా వంతులు, ఉద్యోగస్తులు, నిరుద్యోగ యువత ఆన్లైన్ మోసాలకు గురవుతున్నారన్నారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, గోల్డ్ అండ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా సాంబశివరావు, పల్నాడు జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు మాట్లాడారు. ధనవంతులు కావాలన్నా అత్యాశతో పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు అరుణ రెడ్డి, లేఖా ప్రియాంక, వేణు, పట్టణ వ్యాపారులు పాల్గొన్నారు.

40వ రోజుకు మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయం ఎదుట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన సోమవారం 40 రోజుకు చేరుకుంది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 40 రోజుల నుండి నిరసన చేస్తున్నా ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.అధికారులు తమ పట్ల పక్షపాత వైఖరి అవలంభించడం సరికాదన్నారు. తమకు న్యాయం చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.



నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రతిభ చాటిన విద్యార్థులతో అతిథులు

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన సభ

ప్రజాశక్తి - వినుకొండ

పదో తరగతి పరీక్షలలో టౌన్ ఫస్ట్ సాధించిన గీతాంజలి విద్యార్థులను ప్రభుత్వ చీఫ్ ఇఫ్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభినందించారు. గీతాంజలి విద్యార్థులు టౌన్ ఫస్ట్ సాధించిన సందర్భంగా ఆ పాఠశాల లో జరిగిన అభినందన సభలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గీతాంజలి డైరెక్టర్ వై శేషగిరి రావు పాల్గొన్నారు. ప్రభుత్వ చీఫ్ ఇఫ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం బాగా చదవాలన్నారు.కార్యక్రమంలో అద్భుత విజయాలు సాధించిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులతో అతిథులు

ఇండియా డిజైన్ వీక్ - 2025 లో సత్తాచాటిన ఎన్ఈసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చెన్నైలో శ్రీ సాయిరాం ఇనిస్టిట్యూషన్స్, ఐసీటీ అకాడమీ, ఆటోడెస్క్- ఫ్యూషన్ 360 సంయుక్తంగా ఈ నెల 24, 25లలో నిర్వహించిన "ఇండియా డిజైన్ వీక్ - 2025లో స్థానిక ఎన్ఈసీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో 150 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన గా, తమ కళాశాలకు చెందిన జి.ఆనంద బాబు, వి. హర్ష వర్ధన్ లు "బెస్ట్ యూసర్ ఎక్స్పీరియన్స్ డిజైన్"లో ప్రథమ బహుమతి అందుకున్నారని చెప్పారు. అలాగే, కె.కోటేశ్వర రావు, పి.అజయ్ కుమార్ మొత్తం పోటీలో 5వ స్థానాన్ని కైవసం చేసుకొన్నారన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, పిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ డి.సునీల్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బి.వేం కట శివ, డాక్టర్. ఎం.వెంకన్నబాబు విజేతలను అభినందించారు.

తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించిన ఐసీఎంఆర్ బృందం

ప్రజాశక్తి - తెనాలి

గుండెపోటుకు ప్రభుత్వ వైద్యశాలల్లో అందించే ప్రథమ చికిత్సను ఉపయోగించుకోవాలని ఢిల్లీ ఎయిమ్స్ వైద్యశాల కార్డియాలజిస్ట్ డాక్టర్ రామకఅష్ణన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ (ఐసిఎంఆర్) ప్రతినిధి డాక్టర్ మీనాక్షి శర్మ పేర్కొన్నారు. తెనాలి జిల్లా వైద్యశాలకు సోమవారం ఎయిమ్స్, ఐసిఎంఆర్ బృందం పరిశీలించింది. ఇప్పటి వరకు గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు అందించిన సేవలను వారు తెలుసుకున్నారు. అలాగే రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ గుండె సంబంధిత రోగులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం వారిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు పంపిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 60 మంది రోగులకు రూ.30వేలు విలువ చేసే ఇంజక్షన్ను ఉచితంగా చేసినట్లు చెప్పారు. దీనివలన గుండె కవాటాలలో ఉన్న క్లాట్స్ కరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఐసిఎంఆర్ వైద్యులు

సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి పునర్నిర్మాణ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పెదకాకాని

అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభకు ముఖ్యఅతిథిగా వస్తున్న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను జయప్రదం చేయాలని సోమవారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయములో నియోజకవర్గంలోని మండలం, పట్టణ , అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు సమావేశంలో పాల్గొన్నారు.. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు కందుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, పొన్నూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు..

అన్నదానానికి ప్రతి ఒక్కరు సహకరించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

అన్నదానానికి ప్రతి ఒక్కరు సహకరించాలని మండల కేంద్రమైన పెదకాకానిలోని శివాలయం ఉప కమీషనర్ గోగినేని లీలా కుమార్ కోరారు. సోమవారం గుంటూరులోని కొరిటిపాడుకు చెందిన పూనూరు బసివిరెడ్డి శైలజ దంపతులు పూనూరు మాల కొండారెడ్డి జ్ఞాపకార్థం దేవస్థాన నిత్య అన్నదాన పథకమునకు రూ. 1,11,116/-లు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ తెలిపారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండల కేంద్రం దుగ్గిరాలలో సోమవారం మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభించారు. శివాలయం సెంటర్ వద్ద మంత్రి నారా లోకేష్ సహకారంతో ఏర్పాటు చేయగా ఇన్నాన్ గ్యాస్ ఏజెన్సీస్ వద్ద గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ మరియు గ్యాస్ కంపెనీ వారి సహకారంతో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు మజ్జిగ మరియు త్రాగునీటిని ఏర్పాటు చేస్తారు. వేసవి కాలం ఉన్నంతవరకు ఈ చలివేంద్రాలు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు గద్దె శ్రీనివాస్ గద్దె అను సూర్యవతి పసుపులేటి రవి మిక్కిలినేని గాంధీ జంపాల నరేంద్ర భాస్కర్ పాల్గొన్నారు.

కేశన అరెస్టుకు బీసీ నేతల ఖండన

మాట్లాడుతున్న పారేపల్లి మహేష్

ప్రజాశక్తి - మంగళగిరి

విజయవాడలో "జనగణనతో పాటే సమగ్ర కుల గణన" జరపాలని ప్రధాన డిమాండ్తో శాంతియుతంగా జరుగుతున్న మహా ర్యాలీని పోలీసులు భగ్నం చేసి, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తదితరులను అక్రమంగా అరెస్టు చేయడం తగదని గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పది రోజులు ముందుగానే నగర పోలీస్ కమిషనర్కు మొత్తం కార్యక్రమం నిర్వహణ అనుమతి మంజూరుకై దరఖాస్తు చేసుకోగా, మహా ర్యాలీ జరుగుతుండగా వచ్చి, పోలీసులు అడ్డుకోవడం-రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పోలీసులను కూటమి ప్రభుత్వం అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే గత పాలకులకు పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరిస్తున్నామన్నారు. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాం బాబాజీ, జిల్లా ఉపాధ్యక్షులు జె వరప్రసాద్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు తుమ్ము కామేశ్వరి, అడపా శ్రీనివాసరావు, దానాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుంటూరు

విజయవాడలో శాంతియుతంగా జరుగుతున్న మహార్యాలీని పోలీసులు భగ్నం చేసి, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తదితరులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. సోమవారం చుట్టుగుంటలోని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర యువజన కార్యాలయంలో జరిగిన సమావేశంలో కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ పదిరోజులు ముందుగానే మహార్యాలీకి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా, ర్యాలీ జరుగుతున్న రోజు వచ్చి అడ్డుకపోవటం, రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు పాల్గొన్నారు.

వేసవి వడదెబ్బతో తస్మాత్ జాగ్రత్త..!

ప్రజాశక్తి - మంగళగిరి

వేసవి ఉష్ణోగ్రత తీవ్రతల వలన వడ దెబ్బకు గురైయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వేసవి జాగ్రత్తలు పాటించాలని, మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీమెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనుష అన్నారు. వేసవి ఎండల తీవ్రతలు పెరిగిన నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైతే ప్రాథమికంగా తీసుకోవలసిన చర్యలు గురించి ఆమె వివరించారు. వేసవిలో తీవ్రమైన ఉష్ణోగ్రతల వలన శరీరంలోని నీరు, ఖనిజలవణాలు చెమట ద్వారా అవిరై బయటికి వెళ్ళిపోతాయన్నారు. శరీరంలో తీవ్రంగా ఉష్ణోగ్రత పెరగడంతో వడదెబ్బకు గురి అవుతారన్నారు. వడదెబ్బకు గురైన వారికి విపరీతంగా చెమటలు పట్టడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వికారంతో కూడిన వాంతులు, స్పృహ కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, ఫిట్స్ రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బకు గురైన వారిని వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకువెళ్లి అవసరమైన బట్టలు మాత్రమే ఉంచి, శరీర ఉష్ణోగ్రతలు తగ్గటానికి చల్లటి నీటితో కానీ, ఐస్ గడ్డలను వస్త్రంలో పెట్టి శరీరాన్ని తుడవాలన్నారు. కొబ్బరిబోండం నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, పండ్ల రసాలు, ఓఆర్ఎస్, ఎలక్ట్రాల్ వంటి లవణాలతో కూడిన ద్రవపదార్థాలు ఇవ్వాలన్నారు. వడదెబ్బ తీవ్రత లక్షణాలను బట్టి సమీపంలోని హెల్త్ సెంటర్ కు తరలించి వైద్యం అందించాలన్నారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత బాగా ఉంటుందని 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని యూపీహెచ్సీలో ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష అన్నారు.

పశువులకు వేసవి తాపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తెనాలి

వేసవిలో పశుపోషణలో మెళకువలు పాటించాలని రూరల్ గ్రామం అంగలకుదురు పశు వైద్యశాల వైద్యులు డాక్టర్ సిహెచ్ అనూష చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె పశు పోషకులకు పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రత ఉన్నప్పుడు పాల దిగుబడి తగ్గుతుందని, అసహజ మరణాలు కూడా సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. ఎండ అధికంగా ఉన్నప్పుడు పశువులను షెడ్డులోనే ఉంచి, మేపుకోవాలన్నారు. పచ్చి మేత కోసం బయటికి వెళ్లే అలవాటున్న పశువులను సాయంత్రం వేళలో మాత్రమే బయటకు తీసుకెళ్లాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే చెట్లను ఆధారం చేసుకుని చుట్టూ పట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోజుకు ఒక్కో పశువుకు కనీసం 60 నుంచి 70 లీటర్ల తాగు నీటిని అందించాలన్నారు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో పాల దిగుబడి తగ్గకుండా ఉంటుందని, పశువులు కూడా ఆరోగ్యంగా ఉంటాయన్నారు.

మంగళగిరికి చేరుకున్న అదనపు పోలీస్ బలగాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మే 2వ తేదీన భారత ప్రధాని నరేంద్రమోదీ అమరావతి రాజధాని పర్యటన నేపథ్యంలో అదనపు పోలీస్ బలగాలు మంగళగిరికి చేరుకున్నాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన దాదాపు రెండువేల మంది పోలీస్ సిబ్బంది సోమవారం మంగళగిరికి చేరుకున్నారు. స్థానిక పోలీస్ యంత్రాంగం అదనపు పోలీస్ సిబ్బందికి వసతుల కల్పనలో నిమగ్నమైంది. మే 2వ తేదీ వరకూ అదనపు పోలీస్ సిబ్బంది వివిధ ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించనున్నారు.

తెనాలి రోడ్డు లో భారీ అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక తెనాలి రోడ్డులో గల కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జన్నాదుల బాలకఅష్ణ, గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు గౌడ్, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, వి.శివ రాంబాబు, వి.కిరణ్ కుమార్, వి.పూర్ణ శంకర్రావు, డి.హరి మోహన్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

146వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు సోమవారం నాటికి 146వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో బి.నవనీతం, ఎం.శారద, వై రమాదేవి, వి.లక్ష్మి, డి.రమణ కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాన్ని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బి.సూర్యప్రకాశరావు, ఎం.ఆశీర్వాదం, వై. యహెూశవ, ఎం.గురవయ్య, కె.హగ్గయ్య, ఆర్.ఇస్రాయెల్, వి.సోమయ్య, ఎం.డి. ఇస్మాయిల్, బి.అంకయ్య, టి.దుర్గా భవాని, టి.నిశాంత్ సాయి, టి.సరిత శ్రీ దివ్య, ఎం.శరన్, ఏ విజయశ్రీ, ఎం.శివకుమారి, శారమ్మ, ఎస్.కె.ఇమాంబి, డి.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు..

రూ. 60 వేల ఎల్వోసీ చెక్కు అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును టీడీపీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. తాడేపల్లి 14వ వార్డుకు చెందిన నేరిశెట్టి పద్మావతికి రూ. 60 వేల విలువైన ఎల్వోసీ చెక్కును అందజేశారు. . ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధారదాసు, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బూదాల రవికుమార్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వల్లభాపురం పీటర్ పాల్, సీనియర్ నాయకులు బొల్లెద్దుల మరియన్న, 6వ వార్డు అధ్యక్షులు దేవళ్ళ ప్రసాద్, మంగళగిరి నియోజకవర్గ మహిళా కార్యదర్శి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భవిష్య నిధిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని సిబార్ దంత వైద్య కళాశాలలో సోమవారం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ మరియు ఇ.ఎస్.ఐ., మినిస్ట్రీ ఆఫ్ లేబర్ వారి తరఫున "నిధి అప్ కే నికత్" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రావిడెంట్ ఫండ్ గుంటూరు రీజనల్ ఆఫీసు నుండి ఎన్ఫోర్స్ మెంట్ ఆఫీసర్ కె. నారాయణమూర్తి, సీనియర్ సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ పి. వెంకటేశ్వరరావు మరియు ఇ.ఎస్.ఐ. నుండి అసిస్టెంట్ మేనేజర్ రమేష్ విచ్చేసి పి.ఎఫ్., ఇ.డి.ఎల్.ఐ., పెన్షన్ మరియు ఈ-నామినేషన్, కెవైసీ మరియు ఇ.ఎస్.ఐ. గురించి అన్ని విషయాలను కూలంకూషంగా సదస్సులో పాల్గొన్న వారికి తెలియజేశారు.

ఉమ్మడి జిల్లాలో పలువురికి ఎంపిడిఒలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-గుంటూరు

మండల పరిషత్‌లలో పనిచేస్తున్న ఏఒలు, డిప్యూటీ ఎంపిడిఒలకు పదోన్నతి కల్పించారు. ఆ విధంగా పదోన్నతి పొందిన ఆరుగురు మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారుల్ని ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని పల్నాడు, బాపట్ల జిల్లాలకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దాచేపల్లి ఎంపిడిఒ కార్యాయ ఏఒ పి.రత్నంకు పదోన్నతి కల్పించి పల్నాడు జిల్లాకు కేటాయించారు. గురజాల ఎంపిడిఒ కార్యాలయ ఏఒ ఆర్.సాంబశివరావును పల్నాడు జిల్లాకు కేటాయించారు. భట్టిప్రోలు డిప్యూటీ ఎంపిడిఒ టి.ఊహారాణికి పదోన్నతి కల్పించి బాపట్లకే కేటాయించారు. తుళ్లూరు డిప్యూటీ ఎంపిడిఒ డేవిడ్ ప్రభాకర్, ప్రత్తిపాడు డిప్యూటీ ఎంపిడిఒ జి.రవికుమార్, తాడేపల్లి డిప్యూటీ ఎంపిడిఒ పి.రవికుమార్‌కు పదోన్నతి కల్పించి పల్నాడు జిల్లాకు కేటాయించారు. కాగా జెడ్పీ అధికారులకు వారికి మండలాలు కేటాయిస్తారు.

సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, వై కృష్ణకాంత్ తదితరులు

3న డిఎస్సీపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మే 3న సాయంత్రం 4గంటలకు 2/7 బ్రాడిపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగే అవగాహన సదస్సును జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. సోమవారం బ్రాడీపేటలోని డివైఎఫ్ఐ కార్యాలయంలో అవగాహన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ డిఎస్సీకి ఎలా సిద్ధం కావాలి, ఎటువంటి ప్రశ్నలు అడగటానికి అవకాశం ఉంది తదితర అంశాలపై సదస్సులో అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. సదస్సుకి హాజరైన అభ్యర్థులకి 'ఎడ్యుకేషన్ సైకాలజీ', ఎస్.జి.టి అభ్యర్థులకు 'గణితం కంటెంట్ బుక్' పుస్తకాలు ఉచితంగా అందచేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్ మాట్లాడుతూ సదస్సులో పోటీ పరీక్షల నిపుణులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సబ్జెక్ట్ నిపుణులు పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. ఇతర వివవరాల కోసం 94900 99992 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత విడుదలైన నోటిఫికేషన్‌పై అభ్యర్థులు ఎన్నో ఆశలు పెట్టుకున్నందున అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నాలుగు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా వయోపరిమితి 47 ఏళ్లకు పెంపు, డిగ్రీలో అర్హత మార్కులు 40 శాతానికి తగ్గించాలని, పరీక్షకు సిద్ధం కావటానికి 90 రోజుల గడువు ఇవ్వాలని, ఒక జిల్లాకు ఒకే పేపర్ ఉండాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎమ్.కిరణ్, ఎస్.కె.సమీర్, ఎస్.పద్మ, సుబానీ పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మలినేనిలో ముగిసిన ఉచిత పాలీసెట్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పాలీసెట్ ఉచిత శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి.ఈ సందర్భంగా కాలేజి చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో గత 8 సంవత్సరాలుగా కళాశాల ప్రొఫెసర్లతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఉచిత శిక్షణ పొందిన ఎందరో విద్యార్థులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌లో ర్యాంకులు సాధించి, కళాశాలలో స్థానాలు సాధించారు. ఉచితంగా ట్రైనింగ్ ఇచ్చిన ప్రొఫెసర్లకు చైర్మన్ అభినందనలు తెలిపారు

మోడీ పర్యటన విధులు సమన్వయంతో చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా మే2న విధులు కేటాయించబడిన నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రధాని పర్యటనకు విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సభా ప్రాంగణంలోని ప్రధాన వేదిక, వివిఐపి వేదిక, కల్చరల్ వేదికలలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. 6 పార్కింగ్ ఏరియాలలోనూ మౌలిక సదుపాయాలు, శానిటేషన్ పనులు, గ్యాలరీలో పారిశుధ్య పనులు నిర్వహించటానికి అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించామన్నారు. ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డుతో విధులు నిర్వహించాలని, యాప్రాన్, మాస్క్, గ్లౌజు ధరించి, డస్ట్‌బిన్ కలిగి ఉండి, సభా ప్రాంగణం వద్ద వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ముఖ్యంగా ఫుడ్‌కోర్ట్, మెడికల్ క్యాంపు, హెల్ప్‌డెస్క్ వద్ద పారిశుధ్యం పక్కాగా ఉండాలన్నారు. మొబైల్ టాయిలెట్స్‌కు నీటి సరఫరా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, అధికారులు, సిబ్బంది మే1వ తేదీ ఉదయం నుండి పూర్తి స్థాయిలో కేటాయించిన ప్రాంతాల్లో ఉండాలన్నారు.సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిఎంఒహెచ్ డాక్టర్ అమతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ రవిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, వేతనాలు చెల్లించాలి..

గుంటూరు కలెక్టర్ గ్రీవెన్స్‌కు 184 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న డిఆర్ఒ

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఆర్ఓ ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, స్టెప్ సిఈఓ చంద్రముని ప్రజల నుండి 184 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ అధికారులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని గడువులోపు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన పిటీషన్లు గుణాత్మకంగా , సహేతుకంగా ఉందా , లేదా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు.

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, వేతనాల కోసం వినతి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఐదు నెలల వేతన బకాయిలు, బిల్లులు చెల్లించాలని, పెంచిన మెనూ ఛార్జీలు అమలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆనుబంధ ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 2024 డిసెంబర్ నుండి వేతనాలు, వంట బిల్లులు చెల్లించకపోవటం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అప్పులు తెచ్చి ఏజెన్సీలు నిర్వహిస్తున్నారన్నారు. ఇస్కాన్ వంటి స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే మండలాల్లో కేంద్ర ప్రభుత్వం నుండి ఇవ్వాల్సిన రూ.1000లు కూడా ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు జావ తయారీకి కావాల్సిన గ్యాస్ ఇవ్వట్లేదని, మెనూలో రకరకాల మార్పులు చేస్తున్నారన్నారు. అయితే ఆయా మార్పులకు అనుగుణంగా వంట వండి పెట్టడానికి నిర్వాహకులు సిద్ధంగా ఉన్నా, మెనూ ఛార్జీలు పెంచకుండా, రెగ్యులర్‌గా బిల్లులు, వేతనాలు ఇవ్వకుండా వంట వండటం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. మెనూ ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటన చేసి ఐదు నెలలు అవుతున్నా ఇంత వరకూ అమల్లోకి రాలేదన్నారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయన్నారు. కావున ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20లకు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, యూనియన్ నాయకులు రెడ్డి రమణయ్య, ఎస్.జ్యోతికుమారి, ఎం.రాజ్యలక్ష్మి, ఎన్.రాధిక తదితరులు పాల్గొన్నారు.

మా భూముల్ని ఈ-నామ్ భూములుగా నమోదు చేశారు...

గత ప్రభుత్వ హయాంలో రీసర్వే జరిపి, హక్కులు పత్రాలు ఇచ్చిన తర్వాత వాటిని ఈనామ్ భూములుగా గుర్తించటం వల్ల మా భూములపై లావాదేవీలు నిలిచిపోయాయని, తమ సమస్య ప్రరిష్కరించాలని వట్టి చెరుకూరు మండలం, చమళ్లమూడికి చెందిన ప్రజలు అర్జీ అందజేశారు. గత ప్రభుత్వంలో అన్ని గ్రామాలతో పాటు తమ గ్రామంలో కూడా రీసర్వే నిర్వహించారని, రెవెన్యూ అధి కారులు మాకు యాజమాన్య హక్కు పత్రాలు, పట్టాదారుపాస్ పుస్తకాలు కూడా ఇచ్చారన్నారు. ఆ తర్వాత ఎలాంటి విచారణ జరపకుండానే రైతు వారీ పట్టాలు ఉన్నా కూడా మాకు చెందిన సుమారు 900 ఎకరాల భూములను ఈనామ్ భూములగా చూపించారన్నారు. ఫలితంగా 1బి, అడంగళ్ మంజూరు కావట్లేదని, దాని వల్ల బ్యాంకుల నుండి రుణాలు, భూ మిక్రయాలు నిలిచిపోయాయన్నారు. కావున భూములను చట్టపరంగా విచారణ జరిపి, న్యాయం చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో వై.శ్రీనివాసరావు, డి.ఆదిశేషయ్య, ఎ .ఆంజనేయులు, నరేంద్రనాద్ తదితరులున్నారు.

పట్టా మంజూరుకు తహశీల్దార్ లంచం డిమాండ్

సైనికునిగా పనిచేసినందుకు ప్రభుత్వం తనకు ఇచ్చిన భూమికి పట్టా ఇవ్వటానికి తాడికొండ మండల తహశీల్దార్ రూ.5 లక్షలు డిమాండ్ చేశాడని లాం గ్రామానికి చెందిన రాయపూడి కృపాచారి గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశాడు. మద్రాస్ రెజిమెంట్‌లో సైనికునిగా పనిచేస్తూ 2006 సంవత్సరంలో రిటైర్ అయ్యాయని, సైనికునిగా చేసిన సేవకు గుర్తింపుగా లాం గ్రామంలోని సర్వేనెంబర్ 123/ 1-2లో 1.35 ఎకరాలు భూమిని కేటాయించారన్నారు. ఇందులో 38 సెంట్లుకి అప్పటి కలెక్టర్ కోనా శశిధర్ పట్టా అందించారని, మిగిలిన 97 సెంట్లకు వివిధ కారణాలతో పట్టాను నిలుపుదల చేశారన్నారు. ఇటీవల తాడికొండ తాహసిల్దార్ కలిసి విన్నవించు కోగా పట్టా కావాలంటే రూ.5లక్షలు డిమాండ్ చేశారని.. తాను అంత డబ్బు ఇవ్వలేనని చెప్పడంతో 2024 నవంబర్‌లో ఫణీంద్ర అనే వ్యక్తి పేరుతో భూమిని ఎక్కించి అమ్మేందుకు ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. భూమి విలువ కోట్లలో ఉండడంతో భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని అధికారులు స్పందించి తనకు కేటాయించిన భూమి పట్టా అందించాలని సోమవారం కలెక్టరేట్లో వినతిపత్రం అందించారు.

జిజిహెచ్‌కు పరికరాలు ఇవ్వండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పరికరాలు, సిబ్బంది మంజూరు చేయాలని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శికి ఆయన సోమవారం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని ఇతర ఆసుపత్రుల్లో వినియోగంలో లేని వైద్య పరికరాలను గుంటూరు ఆసుపత్రికి తరలించి సేవల వినియోగాన్ని మెరుగుపర్చాలని కోరారు. అంతేకాకుండా, ఆసుపత్రిలో రోగులకు వేగవంతమైన సేవలందించేందుకు కనీసం 50 మంది క్లాస్-4 సిబ్బందిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజూ వేలాది మంది రోగులకు సేవలందిస్తున్న జిజిహెచ్‌లో మౌలిక సదుపాయాల అభివద్ధి అత్యవసరమని, ఈ చర్యలు తీసుకుంటే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రోటరీ వితరణ

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వారు ఆపరేషన్ థియేటర్ లెనిన్ గౌనులని వితరణ చేసారు. ఈమేరకు రోటరి క్లబ్ ప్రతినిధి రత్నకుమారి ఈ దుస్తులను ప్రసూతి విభాగం లోని ఆపరేషన్ థియేటర్ కి అందచేశారు. సూపరింటెండెంట్ రమణ, డాక్టర్ జయంతి, సుభాషిణి, కిరణ్మయ్ తదితరులు పాల్గొన్నారు.

1న సోమేపల్లి జయంతి, సాహిత్య పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో మే 1వ తేదీన సాయంత్రం 6 గంటలకు స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, సాహిత్య పురస్కారాల ప్రదాన సభ గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్ఎం సుభాని, శ్రీవశిష్ట సోమేపల్లి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చెలపాక ప్రకాష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు డాక్టర్ పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణలు, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, గుళ్లపల్లి సుబ్బారావు పాల్గొంటారన్నారు. సోమేపల్లి సాహిత్యంపై కందిమళ్ల శివప్రసాద్, సోమేపల్లి వ్యక్తిత్వంపై నానా విశ్లేషిస్తారని చెప్పారు.'రెక్కలు వచ్చాయి' కథా రచయిత్రి సి.యమునకు కథా పురస్కారం, 'జీవ రహస్య లిపి' కవి ఖాదర్ షరీఫ్‌కు కవితా పుర స్కారం అందజేయటం జరుగుతుందన్నారు. నగరంలోని కవులు, రచయితలు, సాహితీప్రియులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.